# ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవ సంబరాలు

**తేది:22.08.2022**

ద్రావిడ విశ్వవిద్యాలయంలో సోమవారం ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలను వర్శిటీ జానపద విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం వర్శిటీ మెయిన్ గేటు వద్ద వర్శిటీ ప్రథమ మహిళ శ్రీమతి విజయలక్ష్మి గారి ఆధ్వర్యంలో మహిళలు పొంగళ్ళతో దేశిసిరి ప్రాంగణానికి చేరుకుని అమ్మవారికి పొంగళ్ళను పెట్టి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని జానపద కళారూపాల ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా నుండి వచ్చిన బుర్రకథ అమ్మయ్య కళాకారుల బృందం కాబోజిరాజు కథాగానం ప్రదర్శించారు. బైరెడ్డిపల్లి నుండి వచ్చిన వీధినాటకం కళాకారులు బృందం నలతంగ కథను ప్రదర్శించారు.  వి.కోట మండలం నుండి కోలాటం, రామకుప్పం నుండి డప్పు శ్రీరంగడు కళాకారుల కళా ప్రదర్శనలు చేశారు. విద్యార్థినీ విద్యార్థులు డప్పు వాయిద్యాల మధ్య నృత్యాలు చేశారు. వర్శిటీ బోధన, బోధనేతర సిబ్బంది జానపద సాంప్రదాయ దుస్తులతో జానపద దినోత్సవంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వర్శిటీ వైస్-ఛాన్సలర్ ఆచార్య తుమ్మల రామకృష్ణ గారు మాట్లాడుతూ... ప్రపంచ జానపద దినోత్సవాన్ని జరుపుకోవడం వలన జానపద సంస్కృతీ సాంప్రదాయాలు, కళలను భావితరాలకు తెలియజేస్తూ జానపద కళాభాండాగారాన్ని వారికి అందించడానికి దోహదపడుతుందని అన్నారు. మొత్తం ప్రపంచ సాహిత్యాన్ని మనం అవలోకించినట్లైతే దానికి పునాది, వాటి మూలాలు అన్నీ పల్లెల్లోనే ఉన్నాయన్నారు. ఎక్కడో మన పూర్వీకులు మనకు అందించినటువంటి జ్ఞానమే తరువాత మనకు భారతం, భాగవతం, రామాయణం, పురాణాలు, కావ్యాలు, ఇతిహాసాలు, ప్రబంధాలు, నాటకాలు, నవలలు, కథలు వంటివి అయ్యాయని ఆయన తెలిపారు. ఆదిమ సమాజంలోకి వెళ్ళినట్లైతే అనువుగా తిరిగినటువంటి రోజుల్లో ఏ భాషా, అలంకరాలు లేనటువంటి రోజుల్లో మనమందరం కూడా ఆదిమ సమాజం నుంచి మధ్యయుగాల వరకు దాదాపుగా ఏ నాగరికతా లేకుండా ఎదిగినటువంటి మానవులమే అన్నారు. మళ్ళీ నాగరికత పెరిగిన తరువాత పట్టు వస్త్రాలు, అంత:పురాలు, కళాశాలలు, యూనివర్శిటీలు ఇలా అన్నీ పుట్టుకొచ్చాయని అన్నారు. అందుకే మూలాలను ఎవరూ మరిచిపోకూడదని ఆయన అన్నారు. మనం ఆడుకున్న ఆటలు, పాడుకున్న పాటలు గాల్లో కలిసిపోతాయని, అయితే మనం రాసిన రాత చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు. జానపదం సాహిత్యమే కాదు అని నిరాదరించిన రోజుల్లో బిరుదరాజు రామరాజు కాలికి బలపం కట్టుకుని వేలాది జాపద గేయాలు సేకరించి 1955కు ఆయన ఒక అద్భుతమైన పరిశోధన గ్రంథాన్ని అందించారన్నారు. అక్కడ్నుంచి కృష్ణకుమారి, తంగిరాల సుబ్బారావు, ఆర్వీఎస్ సుందరం, జి.ఎస్.మోహన్, సుబ్బాచారి భక్తవత్సల రెడ్డి వంటి వారెందరో అక్కడ్నుంచి అందుకున్న వారసత్వం జానపదం ఒక సాహిత్యంలో ఒక విభాగంగా ఏర్పడటానికి తోడ్పడిందన్నారు. అలాంటి జానపద సాహిత్యాన్ని మనం మరచిపోకూడదని అన్నారు.

జానపద సంబరాల్లో పాల్గొన్న వివిధ రకాల జానపద కళాకారులను వర్శిటీ తరపున ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జానపద దినోత్సవం సందర్భంగా మధ్యాహ్నం జానపద సాంప్రదాయ వంటకాలను ఏర్పాటు చేయడంతో అందరూ ఆస్వాదిస్తూ స్వీకరించారు.

ఈ వేడుకల్లో వర్శిటీ రెక్టార్ ఆచార్య టి.అనురాధ, రిజిస్ట్రార్ డా.ఎ.కె.వేణుగోపాల్ రెడ్డి, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య అక్యుటర్ బాబు, వర్శిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఆచార్య ఎన్.సుశీల, జానపద విభాగాధిపతి ఆచార్య ఎమ్.ఎన్.వెంకటేశ్, ఆచార్య కె.శ్యామల, పీఠాధిపతులు, శాఖాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు, జానపద కళాకారులు పాల్గొన్నారు.

**- డా.పి.మురళీకృష్ణారెడ్డి, పిఆర్ఓ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం**







